క్లుప్తంగా

రోటరీ బ్లడ్ బ్యాంక్ సేవలు విస్తృతం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ బ్లడ్ బ్యాంక్ సేవలు సకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని బ్లడ్ బ్యాంక్ నూతన అధ్యక్ష బాధ్యత చేపట్టిన డాక్టర్ ముత్తా నవీన్ ప్రకటించారు. రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. కార్యదర్శిగా నల్లమిల్లి మాచారెడ్డి సభ్యులుగా ఠాగూర్, మమతా శ్రీనివాస్, జీవీ కృష్ణ ప్రకాష్, చిరంజీవి రెడ్డి, రవి శర్మ, డాక్టర్ త్రిమూర్తులు రాయుడు, సతీష్, వడ్డాది ఆదిత్య, పాబోలు చిన్న పున్నయ్య, జి శ్యామ్, ధనసాగర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముత్తా నవీన్ మాట్లాడుతూ రోటరీ బ్లడ్ బ్యాంక్ సేవలు ఉభయగోదావరి జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి సేకరించిన రక్తాన్ని ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్య పరికరాలతో పరీక్షలు నిర్వహించి రోగుల కోసం సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

ప్రమాదాల నివారణకు మాక్ డ్రిల్



కాకినాడ రూరల్ ఎన్‌సీఎస్ కంపెనీలో మాక్ డ్రిల్

కాకినాడ రూరల్: కాకినాడ పరిసర ప్రాంతాలు, రూరల్ మండల గ్రామాల్లో ఉన్న ముఖ్యమైన కర్మాగారాలతో పాటు ఆయిల్ స్టోరేజ్ కంపెనీల్లో ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా సిబ్బందిని, అధికారుల అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్ గ్రీన్, కోరమాండల్ కర్మాగారాల్లో మాక్ డ్రిల్ ద్వారా క్లోరిన్, అమ్మోనియా లీకేజీని అరికట్టడంపై అవగాహన కల్పించారు. ఆదివారం ఇండస్ట్రియల్ ఏరియాలో ఎన్‌సీఎస్ కంపెనీలో ఆయిల్ లీకేజీ ద్వారా ప్రమాదాలు జరిగితే ఫోమ్ ద్వారా నివారణ చర్యలపై మాక్ డ్రిల్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఎన్‌సీఎస్ సిబ్బంది పర్యవేక్షించారు.


లయన్స్ సేవలు విస్తరింపజేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులతో మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరింపజేయాలని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం లయన్స్‌హాల్లో గవర్నర్ పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా సీమకుర్తి పాపారావు, కార్యదర్శిగా కొమ్మిశెట్టి కుమార్, కోశాధికారిగా వి.నూకాజీలు, ఇతర సభ్యులను నియమించారు. సభాధ్యక్షుడు ఏంవీఆర్ మోహన్‌కుమార్ 2024–25లో చేపట్టే కార్యక్రమాలు వివరించారు. క్లబ్ సభ్యులు పుత్రరావు, పద్మతులసి, బాదం కుసుమ, డేగల చంద్రశేఖర్, సునీత, రత్నాశ్రీలు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం



ఉపాధ్యాయిని అందించిన డొక్కా సీతమ్మ విగ్రహం

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు తెలుగు పండిత్ (స్కూల్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న ముత్య వెంకట రామలక్ష్మి డొక్కా సీతమ్మ విగ్రహాన్ని అందజేశారు. సుమారు రూ.80వేలు సొంత ఖర్చులతో తయారు చేయించిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు సమకూర్చినట్టు వెంకటరామలక్ష్మి తెలిపారు. ఈ విగ్రహాన్ని సోమవారం డీఈఓ, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని ఉపాధ్యాయుడు పాల్ రాజు తెలియజేశారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో బీజేపీ ఆధ్వర్యంలో డాక్టరు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పార్లమెంట్ కన్వీనరు రంబాల వెంకటేశ్వరరావు, పెండెం సత్యనారాయణ, సలాది నాయుడు, తదితరులు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడని, ఆర్టికల్ 370 రద్దు చేయాలని ఆయన నినదించారన్నారు. దేశభక్తి, విలువలతో కూడిన రాజకీయాలు దేశానికి అవసరమని గుర్తించిన మహోన్నత వ్యక్తి శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.

అరకొర ఆదాయం.. ఆలయ నిర్వహణ భారం

- కూటమి నేతల రాజకీయ కక్షతో ఆదాయాన్నిచ్చే షాపుల కూల్చివేత
- ఏడు నెలలుగా జీతాలు లేక సిబ్బంది అవస్థలు
- సంతచెరువు కనకదుర్గమ్మకు ధూపదీప నైవేద్యాలకూ ఇబ్బందే
- అమ్మవారిపైనే భారం వేసిన అర్చకులు, సిబ్బంది



ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ కూల్చిన ప్రాంతంలో నిలిపి ఉంచిన ఆటోలు



ఆలయం వద్ద అనధికారికంగా ఏర్పాటుచేసిన షాపులో కొబ్బరికాయలు, అరటిపండ్లు, పూజా సామగ్రి విక్రయం

బోట్‌క్లబ్ : ఆలయానికి ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును కూల్చివేయడంతో నేడు ఆలయంలో పనిచేసే సిబ్బంది, అర్చకులకు జీతాలు లేక అల్లాడిపోతున్నారు. కాకినాడ సంత చెరువు కనక దుర్గమ్మవారి ఆలయానికి ఏడు నెలలుగా ఆదాయం లేకపోవడంతో అక్కడ సిబ్బంది, అర్చకులకు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీప, దూప నైవేద్యాలకూ నిధులు లేకపోవడంతో దాతలు సహకారంతో అక్కడ అమ్మవారికి నైవేద్యాలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ నిర్వహణకు సుమారుగా నెలకు రూ.40 వేలు ఖర్చవుతుండగా హుండీల ద్వారా రూ.10 లోపు ఆదాయం మాత్రమే వస్తోంది. దీంతో ప్రస్తుతం ఇక్కడి సిబ్బంది జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆ పార్టీ నాయకుడు జొన్నాడ చినబాబు చొరవతో సంత చెరువు వద్ద అమ్మవారి ఆలయంలో రూ.25 లక్షలతో మూడు షాపులు, ఈఓ కార్యాలయం, భక్తుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. షాపింగ్ కాంప్లెక్సు ద్వారా నెలకు రూ. 30 వేలు ఆదాయం రావడంతో ఆలయంలో పనిచేసే సిబ్బంది, అర్చకుల వేతనాలకు ఇబ్బంది ఉండేది కాదు.

కూటమి నాయకుల తీరుతో ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సెప్టెంబర్‌లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్సు, ఈఓ కార్యాలయం, మురుగుదొడ్లను కక్షసాధింపు చర్యగా కార్పొరేషన్ అధికారులతో నేలమట్టం చేయించారు. అప్పటి నుంచి ఆలయానికి ఆదాయం లేకపోవడంతో ప్రస్తుతం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం ఎదురుగా కొబ్బరికాయలు, అరటి పండ్లు విక్రయించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా స్థానిక కూటమి నాయకులు అడ్డుకోవడంతో ఆలయానికి ఆదాయం కరువైంది. అక్కడ వేరే వ్యక్తి మాత్రమే అనధికారికంగా ప్రస్తుతం కొబ్బరికాయలు, అరటిపండ్లు విక్రయిస్తున్నాడు. వారికి కూటమి నాయకులు అండ ఉంది. లీజు కోసం వేలం నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించినా నాయకులు అడ్డుతగులుతున్నారు.

ప్రస్తుతం ఆదాయం అంతంత మాత్రమే..

ఆలయానికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయినా నిర్వహణకు ఖర్చు రూ. 40 వేలు పైనే అవుతోంది. ఆలయంలో పనిచేసే అర్చకుడికి నెలకు జీతం రూ.13 వేలు, పడితరం వ్యయం రూ.10 వేలు, అటెండర్‌కు రూ.12, 500, కరెంటు బిల్లు నెలకి రూ.3 వేలు ఖర్చవుతుంది. ఇక్కడ కేవలం హుండీల ద్వారా వచ్చే ఆదాయం ఒక్కటే ఉంది. శుక్రవారం మాత్రమే భక్తులు ఆలయానికి రావడంతో ఆ ఒక్క రోజు మాత్రమే హుండీలో డబ్బులు వేస్తున్నారు. మిగిలిన రోజుల్లో భక్తులు పెద్దగా ఈ ఆలయానికి రాకపోవడంతో నెలకి రూ.10 వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. ఆలయం నిర్వహణ భారమవుతోందని ఈఓ తల పట్టుకుంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. కనీసం అక్కడ కొబ్బరికాయలు, అరటి పండ్లు విక్రయించుకునేందుకు షాపు ఏర్పాటు చేసి లీజుకు ఇస్తే కనీసం నెలకు రూ.10 వేలు అదనంగా ఆదాయం వస్తుందని ఈఓ జిల్లా దేవదాయశాఖాధికారి దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక నాయకులు తన మాట వినడం లేదని ఆయన ఉన్నతాధికారులకు వివరించారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

కూటమి నాయకులు అమ్మవారి ఆలయం పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్సు కూల్చివేయడంతో ప్రస్తుతం అక్కడ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా తయారైంది. షాపులు కూల్చివేసిన ప్రాంతాల్లో ఆటోల్లో కొందరు ఆకతాయిలు చేరి మద్యం సేవిస్తున్నారు. దీనికి తోడు అమ్మవారి ఆలయానికి రక్షణ కూడా లేకుండా పోయింది. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు.

> **ఆదాయం లేక వేతనాలు ఇవ్వడం లేదు**
>
> 
>
> ఆదాయం లేకపోవడంతో ఆలయంలో పనిచేసే సిబ్బంది, అర్చకులకు వేతనాలు, పడితరం డబ్బులు ప్రతి నెలా ఇవ్వడం లేదు. ఏడు నెలలుగా ఆలయానికి ఆదాయం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాను. ఆదాయం పెంపుపై దృష్టి సారిస్తున్నాము.
>
> – జోగా సత్యనారాయణ, ఈఓ, సంతచెరువు, కనకదుర్గమ్మ ఆలయం

బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలిగా గోడి సత్యవతి



బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన గోడి సత్యవతి

బోట్‌క్లబ్: బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలిగా గోడి సత్యవతి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లో నిర్వహించిన ఈ ఎన్నిక కార్యక్రమానికి పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ డీవీఎస్‌రాజు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ పదవికి ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమెను బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షులురాలిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ గతంలో తాను 41వ డివిజన్‌లో బీజేపీ కార్పొరేటర్‌గా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సహకారంతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాలకొండయ్య, యార్లగడ్డ రామ్‌కుమార్, జ్యోతుల రాజేష్, కవికొండల భీమశంకర్ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది కుమార్ యాదవ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ గొప్ప గాంధేయవాదని అన్నారు. దేశ మొట్ట మొదటి కార్మిక మంత్రిగా సేవలందించారని, 1986 జూలై 6న న్యూఢిల్లీలో మరణించారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సూర్యారావుపేట బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో నిఘా



సూర్యారావుపేట బీచ్‌కు వెళ్లే మార్గంలో డ్రోన్ కెమెరాతో నిఘా

కాకినాడ రూరల్: పర్యాటక ప్రాంతం కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు డ్రోన్ కెమెరాలతో ఆదివారం నిఘా ఉంచారు. బీచ్‌కు సందర్శకులు అధిక సంఖ్యలో రావడంతో వారికి రక్షణ, భద్రతా చర్యల్లో భాగంగా డ్రోన్లతో నిఘా ఉంచారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచామని, సందర్శకులు పోలీసులు సూచనలు పాటించాలని రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్సై గణేష్ కుమార్ సూచించారు.

విద్యతోనే ఉన్నత స్థానం



పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో ఏకలవ్యుడి జయంత్యుత్సవంలో పాల్గొన్న నాయకులు

పిఠాపురం: స్థానిక జగ్గయ్య చెరువులో ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావాడ పోశయ్య ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని అన్నారు. గురువు లేకున్నా స్వయంశక్తితో ఏకలవ్యుడు గొప్ప విలుకాడు అయ్యాడని చెప్పారు. ప్రతి యువకుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి వీరలంక సజ్జా రాజేంద్ర, జగ్గంపేట సంఘం మండలాధ్యక్షుడు మానుపాటి ఈశ్వరరావు, ఏలేశ్వరం అధ్యక్షుడు బండి నూకరాజు, అర్బన్ క్రెడిట్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు పరిశీలన



సామర్లకోట రైల్వే గేటును పరిశీలిస్తున్న మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని రైల్వే గేటును స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అనేక మంది వాహన చోదకులు గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్న సమయంలో కొంత మంది గేటులో ఉండగా గేటు వేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గేటులోనికి వాహన చోదకులు ప్రవేశించిన తరువాత వారు బయటకు వెళ్లే విధంగా చూడాలని గేట్‌మెన్‌లకు ఆయన సూచించారు. గేటు వేసే ముందు సైరన్ మోగించాలని సూచించారు. గేటు కిందికి దిగుతున్న సమయంలో వాహన చోదకులు గేటులోనికి ప్రవేశించరాదని ఆయన సూచించారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



ఉప్పాడ బీచ్ రోడ్డులో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్మెట్ ధరించడంపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. సిబ్బందితో బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

పశుమాంసం స్వాధీనం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆదివారం అక్రమ పశువధశాలపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1000 కిలోల పశుమాంసం స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారంతో చెందుర్తి గ్రామ శివారు ప్రాంతంలో అక్రమ పశువధశాలపై దాడి చేశామన్నారు. పశువులను వధించి వాటి మాంసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఆరుగుల తాతయ్య, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్, మిర్యాల రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 1000 కిలోల పశుమాంసంతో పాటు ఆటో, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న పశు మాంసాన్ని పూడ్చిపెట్టి, నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఆలయాల్లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో సాంబమూర్తినగర్‌లోని వేంకటేశ్వరస్వామి



సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి



యండమూరులో ప్రత్యేకాలంకరణలో మీసాల వేంటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో పలు ఆలయాల్లో ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవాలయంవీధిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి వారిని అనంత శయన రంగనాథస్వామిగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక భానుగుడి వద్ద భానులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు నగరంలో పలు ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

కాకినాడ రూరల్: సర్పవరంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో పాటు పలు విష్ణు ఆలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలను తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం సుందరంగా అలంకరించి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు, సర్పవరంలో భావనారాయణ స్వామి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, సర్పవరం, చీడిగ, కొవ్వాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరప: స్థానిక విష్ణ్వాలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వేణుగోపాలస్వామిని తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామ అర్చన, రుక్మిణి, సత్యభామ అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ, చీర్ల శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.యండమూరు ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లకు, కొంగోడు, పెనుగుదురులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పెనుగుదురు, జెడ్.భావారం, కూరాడ తదితర గ్రామాల్లోని విష్ణ్వాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్‌సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు.

శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ



ముత్యాలమ్మవారిని శాకంబరిగా అలంకరించిన దీపారాధన సంఘ సభ్యులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో వేంచేసియున్న ముత్యాలమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం కావడంతో ముత్యాలమ్మవారిని పంచారామ క్షేత్రమైన శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. సామర్లకోట– కాకినాడ రోడ్డులో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కాకినాడ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆషాఢ మాసం రెండవ ఆదివారం కావడంతో పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఈ రోడ్డులో రాకపోకలు సాగించే భక్తులు ముత్యాలమ్మ వారిని దర్శించుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం

- గొల్లప్రోలులో నేడు వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత



ఏర్పాట్లపై నాయకులతో సమీక్షిస్తున్న వంగా గీతావిశ్వనాథ్

పిఠాపురం: ఈనెల 7వ తేదీ సోమవారం పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం గొల్లప్రోలు సత్యకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. గొల్లప్రోలులో ఆమె ఆదివారం ఏర్పాట్లు పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు, ఆయనతో పాటు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, పార్లమెంట్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు భారీగా తరలి వచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల నాయకులతో ఏర్పాట్లపై సమీక్షించామన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో పథకాలు అమలు చేస్తామని నమ్మించి మోసం చేయడంతో ప్రజలందరూ కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి అండగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఈపోరాటం ఆగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేసారో తెలియజేస్తామన్నారు. పథకాల్లో కోతలు విధిస్తూ పేద ప్రజలను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. వీటన్నిటి పైనా పోరాటం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఈమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.